ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తమిళనాడు
TAMILNADU
గురువారం 6 జూన్ 2024

ఇండియా కూటమి నేతలతో స్టాలిన్ భేటీ

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'ఇండియా' కూటమి నేతల సమావేశంలో పాల్గొనేందుకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ఉదయం ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. ఆయనతోపాటు సతీమణి దుర్గా స్టాలిన్, ఎంపీ టీఆర్ బాలు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి మురుగానందం, ఐజీ సెంథిల్‌వేలన్ తదితరులు వెళ్ళారు. ఢిల్లీ వెళ్ళిన స్టాలిన్‌కు డీఎంకే రాజ్యసభ ఎంపీ తిరుచ్చి శివా తదితరులు స్వాగతం పలికారు. అదే సమయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విమానాశ్రయంలో ఉన్నట్లు తెలుసుకుని స్టాలిన్ ఆయన వద్దకు వెళ్ళి ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే రీతిలో తమిళనాట అన్ని చోట్లా డీఎంకే గెలిచినందుకు చంద్రబాబు కూడా స్టాలిన్‌కు అభినందనలు తెలిపారు. సుమారు పావుగంటసేపు ఇద్దరూ పరస్పరం మాట్లాడుకున్నారు. ఆ తర్వాత స్టాలిన్ తమిళనాడు హౌస్‌లో బుధవారం సాయంత్రం వరకు బసచేశారు. అనంతరం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటైన ఇండియా కూటమి పార్టీల నేతల సమావేశానికి స్టాలిన్ బయలుదేరి వెళ్ళారు. ఆ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, మిత్రపక్షాల నేతలు అఖిలేష్ యాదవ్, శరద్‌పవార్, తేజస్విని, డి.రాజా, సీతారామ్ ఏచూరి, ఉద్ధవ్‌ఠాక్రే తదితరులను కలుసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా భవిష్యత్తులో తాము వ్యవహరించాల్సిన తీరుపై నేతలు చర్చించినట్లు సమాచారం.



ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్‌గాంధీతో కలిసి పాల్గొన్న సీఎం ఎంకే స్టాలిన్

రెండు రోజులు భారీ వర్ష సూచన

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావం, వాతావరణంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం తిరుచెందూరు, వేలూరు, రాణిపేట, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు, కళ్ళకురిచ్చి, మైలాడుదురై తదితర జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. గురువారం నీలగిరి, తేని, దిండుగల్, ఈరోడ్, నామక్కల్, కరూరు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురువనున్నాయి. నగరానికి సంబంధించినంతవరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ అక్కడక్కడా ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని, రాత్రిపూట ఉరుములు, మెరుపులతో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నగరంలో బుధవారం సాయంత్రం పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రాయపేట, కోయంబేడు, వడపళని, తాంబరం, ఆవడి, మనలి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడటంతో నగరవాసులు ఊరట చెందారు.



బుధవారం సాయంత్రం చెన్నైలో కురుస్తున్న వర్షం

ద్రవిడ పార్టీలతో పొత్తు లేకుండానే..!

బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంకు

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఖాతా తెరవలేకపోయినా ఓటు బ్యాంక్ మాత్రం గణనీయంగా పెంచుకోగలిగింది. అందులోనూ ద్రవిడ పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా పీఎంకే, టీఎంసీ వంటి చిన్న పార్టీలతో బరిలోకి దిగి తన ఉనికిని చాటుకోగలిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి గతం కంటే ఓటు బ్యాంక్ పెరిగిందని, భవిష్యత్తులో పార్టీ ఎంపీ సీట్లను సాధించుకోగలుగుతుందని ఈ ఎన్నికల ఫలితాలు చాటిచెబుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన కోయంబత్తూరులో పోటీ చేసి పరాజయం పొందిన విషయం తెలిసిందే. ఇదివరలో కోయంబత్తూరు నియోజకవర్గం బీజేపీకి పెట్టని కోటగా ఉండేది. ఆ నియోజకవర్గంలో 1998, 1999 ఎన్నికల్లో బీజేపీ తరఫున సీపీ రాధాకృష్ణన్ పోటీ చేసి గెలిచారు. అందుకే అన్నామలై ఆ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నామలై ఆయన సొంతూరున్న అరవకురిచ్చి నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మురుగన్ కేంద్ర మంత్రిగా పదవి స్వీకరించడంతో అన్నామలై రాష్ట్ర పగ్గాలు చేపట్టారు. పార్టీ అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రజలందరితో భేటీ కావాలనుకున్నారు. ఆ మేరకు ఎన్ మణ్, ఎన్ మక్కళ్ పేరుతో రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేపట్టి పార్టీలో కలకలం సృష్టించారు. డీఎంకే మంత్రుల అవినీతిని ఎండగడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఆయన సింహస్వప్నంలా వ్యవహరించారు. అన్నామలై పట్ల రాష్ట్రంలోని యువత ఆకర్షితులయ్యారు. ఈ కారణంగానే బీజేపీకి ఓటు బ్యాంక్ పెరిగిందని భావిస్తున్నారు. కోయంబత్తూరులో పోటీ చేసి అన్నామలై ఓడిపోయినా ఆ నియోజకవర్గంలో 4.5లక్షల ఓట్లను సంపాదించుకోగలిగారు. ఆ నియోజకవర్గంలోని మొత్తం ఓట్లలో 32.8 శాతం ఓట్లు సంపాదించుకోవడం విశేషమేనని పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. ఇదే రీతిలో రాష్ట్రంలో బీజేపీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాల్లో ఓటు బ్యాంక్ పెంచుకోగలిగింది. రాష్ట్రంలో పోలైన మొత్తం ఓట్లలో 11.24 శాతం వరకు బీజేపీ ఓటు బ్యాంక్ సంపాదించుకోగలిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 19 నియోజకవర్గాల్లోనూ నాలుగు చోట్ల మిత్రపక్షాల అభ్యర్థులు బీజేపీ గుర్తుపై పోటీ చేశారు. వీటిలో కోయంబత్తూరు, మదురై, నీలగిరి, కన్నియాకుమారి, తిరునల్వేలి, సౌత్ చెన్నై, సెంట్రల్ చెన్నై, రామనాథపురం, వేలూరు, తిరువళ్ళూరు, తేని నియోజకవర్గాలలో బీజేపీ రెండో స్థానం సంపాదించుకుంది. అన్నాడీఎంకే, డీఎంకే వ్యతిరేక ఓట్లు బీజేపీకే పడ్డాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో అంగబలం, ఆర్థికబలం మెండుగా కలిగిన రెండు ద్రవిడ పార్టీల నాయకత్వంలోని కూటములకు ఎదురొడ్డి నిలిచి ఓటు బ్యాంక్ పెంచుకోవడం సాధారణమైన విషయం కాదని, యువకులంతా బీజేపీకే ఓటేశారని ఫలితాలు రుజువు చేస్తున్నాయని ఆయన చెప్పారు.

కూటమి లేమితో నష్టపోయామా?

అంతర్మథనంలో అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే ● 13 స్థానాల్లో మూడు పార్టీల ఓట్లు చీలిక

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో విడిపోయి పోటీ చేయడం వల్ల తాము నష్టపోయేమోనని అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే పార్టీలు అంతర్మథనంలో మునిగిపోయాయి. ఇందుకు మంగళవారం వెలువడిన ఫలితాలను బేరీజు వేసుకుంటూ భవిష్యత్తులో ఏం చేయాలన్నదానిపై మల్లగుల్లాలు పడుతున్నాయి. రాష్ట్రంలో వున్న 39 లోక్‌సభ నియోజకవర్గ ఫలితాలు మంగళవారం వెలువడిన విషయం తెలిసిందే. ఈ మొత్తం స్థానాలను డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి కైవసం చేసుకుంది. అయితే ఇందులో 13 స్థానాల్లో అన్నాడీఎంకే, బీజేపీ, పీఎంకే పార్టీల అభ్యర్థుల ఓట్ల చీలిక వల్లనే ఇండియా కూటమి అభ్యర్థులు విజయం సాధించినట్లు స్పష్టమవుతోంది. మరో రెండింటిలోనూ అత్యల్ప మెజారిటీతోనే తమ ప్రత్యర్థులు విజయాన్ని సొంతం చేసుకున్నారని ఎన్‌డీఏ నేతలు వాపోతున్నారు. లేనిపక్షంలో ఆ స్థానాలు తమ కూటమికి దక్కి వుండేవని ఆయా పార్టీల కార్యకర్తలు అంచనాలు వేసుకుంటున్నారు. కృష్ణగిరి నియోజకవర్గంలో మొత్తం 11,60,498 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి గోపీనాథ్ కు 4,90,270 ఓట్లు వచ్చాయి. అయితే అన్నాడీఎంకే అభ్యర్థి జయప్రకాష్‌కు 2,98,959 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 2,12,502 ఓట్లు వచ్చాయి.. వీరిద్దరి ఓట్లు కలిస్తే గోపీనాథ్ వచ్చిన ఓట్ల కంటే ఎక్కువనని స్పష్టమవుతోంది. అదేవిధంగా ధర్మపురిలో మొత్తం 12,47,587 ఓట్లు పోలవ్వగా, 4,32,667 ఓట్లు సాధించి డీఎంకే అభ్యర్థి ఎ.మణి విజయం సాధించారు. కానీ అక్కడ ఎన్‌డీఏ కూటమికి చెందిన పీఎంకే అభ్యర్థి సౌమ్య అన్బుమణికి 4,11,367 ఓట్లు, అన్నాడీఎంకే అభ్యర్థికి 2,93,629 ఓట్లు పోలయ్యాయి. ఒకవేళ ఈ రెండు పార్టీలు కలిసి ఉంటే వీరినే విజయం వరించివుండేది. ఇక ఆరణి నియోజకవర్గంలో మొత్తం 11,33,193 ఓట్లు పోలవ్వగా, డీఎంకే అభ్యర్థి 4,01,091 ఓట్లు పొంది విజేతగా నిలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి 2,37,734, పీఎంకే అభ్యర్థి ఎ.గణేష్‌కుమార్ 1,91,462 ఓట్లు పొంది వెనుకబడిపోయారు. ఒకవేళ వీరిద్దరూ కలిస్తే విజయం వీరి సొంతమయ్యేది. అదే విధంగా విల్లుపురంలో మొత్తం 11,54,467 ఓట్లు పోలవ్వగా, డీపీఐ అభ్యర్థి రవికుమార్ 4,77,033 ఓట్లతో ముందంజలో నిలిచారు. కానీ 4,06,330 ఓట్లు పొందిన అన్నాడీఎంకే అభ్యర్థి భాగ్యరాజ్, 1,81,882 ఓట్లు పొందిన మురళీశంకర్ వెనుకబడిపోయారు. ఈ రెండు పార్టీలు జతకట్టివుంటే ఫలితం వేరేలా వుండేదన్నది సుస్పష్టం. కళ్లకుర్చిలో 12,42,597 ఓట్లు పోలవ్వగా, 5,61,589 ఓట్లతో డీఎంకే అభ్యర్థి విజయబావుటా ఎగురవేశారు. కానీ 5,07,805 ఓట్లతో అన్నాడీఎంకే అభ్యర్థి కుమారగురు, 71,290 ఓట్లతో పీఎంకే అభ్యర్థి దేవదాస్ పరాజితులుగా మిగిలిపోయారు. ఒకవేళ వీరిద్దరూ కలిస్తే విజేత ఈ కూటమిలోనే వుండేవారు. అలాగే సేలం, నామక్కల్, తిరుప్పూరు, కోయంబత్తూరు, కడలూరు, చిదంబరం, విరుదునగర్, తెన్‌కాశి నియోజవకర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆ నియోజకవర్గల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిసివుంటే ఖచ్చితంగా ఫలితం మరోలా వుండేదని ఆయా పార్టీల కార్యకర్తలు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా పీఎంకే పోటీ చేసిన పది స్థానాల్లోనే ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం. దీంతో పీఎంకే వర్గాలు తాము బీజేపీతో కాకుండా అన్నాడీఎంకేతో జత కడితే మంచి ఫలితం వచ్చివుండేదని వాపోతున్నాయి.



మరి అప్పుడేమైంది? ఈపీఎస్ వర్గం

ఎన్‌డీఏ కూటమి నేతలతో పాటు అన్నాడీఎంకేలోని కొంతమంది సీనియర్లు తమ కూటమి విడిపోవడం వల్లనే నష్టపోయామని వాపోతుండగా, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి మాత్రం మరోలా భావిస్తున్నారు. ఒకవేళ కూటమి కలిసివుంటే గణనీయమైన స్థానాలు వచ్చేటట్లయితే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు అన్ని స్థానాలు పొందలేకపోయామని ఈపీఎస్ వర్గం ప్రశ్నిస్తోంది. అప్పుడు కేవలం ఒకే ఒక్క స్థానం మాత్రమే సాధించగలిగామని గుర్తు చేస్తోంది. నిజానికి మైనారిటీ వర్గాల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత కారణంగానే ఎన్‌డీఏ కూటమి నుంచి అన్నాడీఎంకే బయటకు వచ్చింది. ఆ మేరకు ఆయా వర్గాలు తమ దరి చేరాయని ఈపీఎస్ వర్గం భావిస్తోంది. అయితే బీజేపీకి తాము దగ్గరగా వున్నామన్న భావన, అధికారపార్టీకి ఇతర బలాలు చేకూరడం తదితరాల వల్ల తమకు ఓటు శాతం తగ్గిందని ఆ వర్గం చెబుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే తమ ప్రధాన లక్ష్యం అయినందున, ఈ ఎన్నికలను తాము పెద్దగా పట్టించుకోవడం లేదని అన్నాడీఎంకేకు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. అయితే బీజేపీతో కాకుండా పీఎంకేతో తాము కలిసినట్లయితే మెరుగైన ఫలితాలు వచ్చివుండేవన్న ఆయన.. పొత్తు కోసం తాము చివరి నిమిషం వరకూ ప్రయత్నించామని, కానీ పీఎంకే నేతలు గొంతెమ్మ కోర్కెలతో తాము మిన్నకుండిపోయామని వివరించారు.

పీఎంకే పొత్తువల్లే బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంక్

- సీమాన్‌కు యువత ఓటేయడం వల్ల ముప్పే
- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పీఎంకేతో పొత్తు కుదుర్చుకోవడం వల్లే బీజేపీకి ఓటు బ్యాంక్ పెరిగిందని, ఆ పార్టీపై రాష్ట్ర ప్రజానీకం మొగ్గుచూపలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై అన్నారు. రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో బుధవారం ఉదయం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలిచిన అభ్యర్థులు ఆయనను కలుసుకున్నారు. ఎంపీలుగా గెలిచినవారిని ఆయన అభినందించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే దూకుడుకు ప్రజలు అడ్డుకట్ట వేశారని, అధికారం చేపట్టేందుకు అవసరమైన మెజారిటీ లేక ఇతర పార్టీల మద్దతుతో పాలన సాగించాల్సిన అగత్యం బీజేపీకి పట్టిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రామాలయం ప్రతిష్ఠించిన అయోధ్యలోనే కాంగ్రెస్ విజయపతాకం ఎగురవేసిందని, చివరకు బీజేపీని శ్రీరాముడు కూడా పట్టించుకోలేదని ఆయన ఆయన విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని గొప్పలు చెప్పుకున్న ఆ పార్టీ నేతలంతా ప్రస్తుతం పత్తాలేకుండా పోయారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఊహించని ఓటు బ్యాంక్ లభించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, వాస్తవానికి పీఎంకేతో పొత్తువల్లే బీజేపీకి ఓటు బ్యాంక్ పెరిగిందన్నదే నిజమని అన్నారు. సీమాన్ నాయకత్వంలోని నామ్ తమిళర్ కట్చికి యువకులు ఓటు వేయడం వల్ల హాని కలుగుతుందని, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆ పార్టీకి యువత దూరంగా ఉంటేనే మంచిదని సెల్వపెరుంతగై హెచ్చరించారు.



సత్యమూర్తి భవన్‌లో కాంగ్రెస్ కొత్త ఎంపీలతో టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, పార్టీ ప్రముఖులు

ఖాయితే మిల్లత్ సేవలు చిరస్మరణీయం

ముఖ్యమంత్రి స్టాలిన్ ● రాజకీయ పార్టీ నేతల ఘననివాళి

ప్యారీస్, జూన్ 5: సీనియర్ పార్లమెంటేరియన్‌గా, ముస్లింనేతగా ఖాయిదే మిల్లత్ మహమ్మద్ ఇస్మాయిల్ అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. ఖాయిదే మిల్లత్ 129వ జయంతిని పురస్కరించుకొని బుధవారం ట్రిప్లికేన్ పెద్ద మసీదు ప్రాంగణంలోని ఆయన స్మారక స్థలంలో ప్రత్యేక ప్రార్థనలను ముస్లిం మతగురువులు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరఫున మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎంపీ స్వామినాథన్, రఘుపతి, గ్రేటర్ చెన్నై మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు ఖాయిదే మిల్లత్ సమాధిపై పూల చాదర్ సమర్పించి నివాళులర్పించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు నివాళులర్పించారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్, ఎంపీ నవాజ్ ఘనీ తదితరులు కూడా ఖాయిదే మిల్లత్ సేవలు స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్స్ పేజీలో ఖాయిదే మిల్లత్‌ను కొనియాడుతూ పోస్ట్ చేశారు. తమిళ భాషాభివృద్ధికి ఖాయిదే మిల్లత్ ఎనలేని కృషి చేశారని, ముస్లిం వర్గాల విద్యాభివృద్ధికి, దేశంలో మతసామరస్యాన్ని పెంపొందింపజేసేందుకు ఆ మహనీయుడు పార్లమెంటు సభ్యుడిగా అందించిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని సీఎం కీర్తించారు.



ట్రిప్లికేన్‌లోని ఖాయిదే మిల్లత్ స్మారక స్థలంలో నివాళులర్పిస్తున్న మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు తదితరులు

డీపీఐ, ఎన్‌టీకేలకు ప్రాంతీయ హోదా ?

● పెరిగిన ఓటు బ్యాంకుతో అవకాశం

అడయార్, జూన్ 5: ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో తోల్ తిరుమావళవన్ సారథ్యంలోని దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ), సినీ దర్శకుడు సీమాన్‌కు చెందిన నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) గణనీయమైన ఓటు బ్యాంకును సొంతం చేసుకున్నాయి. దీంతో ఈ రెండు రాష్ట్ర ప్రాంతీయ పార్టీల హోదాను దక్కించుకోనున్నాయి. ముఖ్యంగా వీసీకేకు ఈ ఎన్నికలు ఊపిరి పోశాయని చెప్పవచ్చు. ఆ పార్టీకి ఉన్న ప్రాంతీయ పార్టీ హోదాను భారత ఎన్నికల సంఘం రద్దు చేసింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసిన రెండు స్థానాలను గెలుచుకుంది. దీంతో వీసీకే మళ్ళీ ప్రాంతీయ పార్టీ హోదాను దక్కించుకోనుంది. మరోవైపు, నామ్ తమిళర్ కట్చి 12 లోక్‌సభ స్థానాల్లో లక్ష కంటే ఎక్కువ ఓట్లను సాధించుకుంది. శివగంగై, శ్రీపెరుంబుదూరు, తెన్‌కాశి, మైలాడుదురై, తంజావూరు, నాగపట్టణం, కాంచీపురం, కృష్ణగిరి, పెరంబలూరు, తూత్తుకుడి, తిరుచ్చి, తిరువళ్ళూరు స్థానాల్లో లక్షకు పైగా ఓట్లు సాధించింది. విలవంగోడు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. గతంలో నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు రైతు గుర్తుపై పోటీ చేసేవారు. కానీ, ఆ పార్టీ ప్రాంతీయ పార్టీ హోదా కోల్పోవడంతో ఆ గుర్తు స్థానంలో మైకు కేటాయించారు. అయినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థులు మెరుగైన ఓట్లు సాధించడంతో నామ్ తమిళర్ కట్చి తిరిగి ప్రాంతీయ పార్టీ హోదాను దక్కించుకోనుంది. ఈ పార్టీకి ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో 8.21 శాతం ఓట్లు వచ్చాయి.



తిరుమావళవన్ - సీమాన్



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం రాజ్‌భవన్‌లో మొక్కలు నాటుతున్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి దంపతులు

సమాచార దర్శిని

ప్రతిభ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 5: తమిళనాడు ముఖ్యమంత్రి ప్రతిభ పరీక్షకు ఈ నెల 11 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ తెలిపింది. ఈ విద్యా సంవత్సరం జూలై 23న జరుగనున్న ఈ పరీక్షకు ప్లస్ వన్ విద్యార్థులు అర్హులు. ఈ పరీక్ష ద్వారా 1,000 మందిని ఎంపిక చేసి వారికి సంవత్సరానికి రూ.10,000 అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 11నుంచి 26వతేదివరకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రభుత్వ కోటా సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. 8,10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 7వ తేదిలోపు www.skilltraining.tn.gov.in, http://www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్లలో దరఖాస్తులు సమర్పించవచ్చు. సీటు పొందిన విద్యార్థులకు శిక్షణా కాలంలో నెలకు రూ.750 ఉపకారవేతనం, ల్యాప్‌టాప్, పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, బస్ పాస్ అందిస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రూ.50 రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-25201163 అనే నెంబరు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఐసిఎఫ్, జూన్ 5: ప్రధాన పైప్ లైన్ల అనుసంధానం కారణంగా గురువారం నగరంలోని మూడు మండలాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలిపింది. ఆర్కాడు రోడ్డులో వడపళని జంక్షన్, పవర్ హౌస్, రంగరాజపురం మెయిన్ రోడ్డు జంక్షన్లలో ఈ పనులు జరుగనున్నాయి. ఈ కారణంగా మండలం 8,9,10 పరిధిలోని ప్రాంతాల్లో పైప్ లైన్లలో తాగునీటి సరఫరా నిలిపివేసి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అత్యవసరాలకు 044-45674567 నెంబరును సంప్రదించవచ్చు.

కుట్రాలంలో తగ్గిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, జూన్ 5: కుట్రాలం జలపాతాల్లో ఇన్ ఫ్లో తగ్గడంతో పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. తెన్‌కాశి జిల్లాలోని జలపాతాల్లో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ ప్రవాహం వల్ల ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో వర్షాలు లేకపోవడంతో జలపాతాల్లో నీటి రాక తక్కువగా ఉంది. మూడు రోజులుగా ఎండ తీవ్రత కారణంగా ఐందుఅరివి, పాత కుట్రాలం, ప్రధాన జలపాతాల్లో పర్యాటకులు నామమాత్రంగానే వచ్చి వెళుతున్నారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, జూన్ 5: మేట్టూరు డ్యాంకు నీటి చేరిక 286 ఘనపుటడుగులకు పెరిగింది. కావేరి డెల్టా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలను బట్టి హొగెనేకల్, మేట్టూరు డ్యాంలకు నీరు చేరడంలో హెచ్చుతగ్గులున్నాయి. మంగళవారం 189 ఘనపుటడుగులున్న ఇన్‌ఫ్లో బుధవారం 386 ఘనపుటడుగులకు చేరుకుంది. డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు సెకనుకు 2,1000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. వచ్చే నీరు కంటే విడుదల చేసేది ఎక్కువగా ఉండడంతో నీటిమట్టాలు తగ్గుతున్నాయి. మంగళవారం 45.47 అడుగులున్న నీటిమట్టం బుధవారం ఉదయం 8 గంటలకు 45.18 అడుగులకు తగ్గింది. నీటినిల్వలు 14.91 టీఎంసీలుగా ఉంది.

చెన్నై నుంచి 1,265 ప్రత్యేక బస్సులు


ఐసిఎఫ్, జూన్ 5: చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు 1,265 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. శుభముహూర్తాలు, వారాంతపు రోజులను పురస్కరించుకొని ఈ నెల 7,8,9 తేదీల్లో కిలంబాక్కం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, నాగర్‌కోయిల్ సహా వివిధ ప్రాంతాలకు 7వ తేది 835 బస్సులు, 8వ తేది 570 బస్సులు, కోయంబేడు నుంచి వేలాంకన్ని, హోసూరు, బెంగుళూరులకు 7,8 తేదీల్లో 160 బస్సులు, 10వ తేది పాఠశాలలు ప్రారంభం కానుండడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి చెన్నై తిరిగొచ్చేందుకు 9వ తేది 705 బస్సులు నడుపనున్నారు. ఈ నేపథ్యంలో, 7 నుంచి ఆదివారం వరకు ప్రయాణించేందుకు 30,000 మంది రిజర్వేషన్ చేయించుకున్నారని అధికారులు తెలిపారు.

ప్రయాణికులు లేక నాలుగు విమానాల రద్దు

పెరంబూర్, జూన్ 5: ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో చెన్నై-శ్రీలంక-చెన్నై మధ్య నడిచే నాలుగు విమానాలు బుధవారం రద్దయ్యాయి. శ్రీలంక ఎయిర్‌లైన్స్ శ్రీలంక నుంచి ప్రతిరోజు వేకువజామున 2.10, సాయంత్రం 3.05 గంటలకు చెన్నైకి రెండు విమానాలు, మరుమార్గంలో చెన్నై నుంచి వేకువజామున 3.10, సాయంత్రం 4.10 గంటలకు రెండు విమానాలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో బుధవారం నాలుగు విమానసేవలు రద్దు చేసినట్లు ఆ సంస్థ ప్రకటించింది.

7 నుంచి వివిధ నగరాలకు బస్సులు


చెన్నై, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లి ముహూర్తం, వారాంతపు దినాలు వస్తుండటంతో ఈ నెల 7 నుంచి మూడు రోజులపాటు చెన్నై నుంచి వివిధ నగరాలకు అదనంగా 1265 బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా సంస్థ అధికారులు తెలిపారు. ఆ మేరకు కిలాంబాక్కం బస్‌స్టేషన్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోవిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూరు, సేలం, ఈరోడ్, తిరుప్పూరు నగరాలకు ఈ నెల ఏడున 835 బస్సులు, ఎనిమిదో తేదీ 570 బస్సులు నడుపుతామన్నారు. ఇదే విధంగా కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి నాగపట్టినం, వేలాంగన్ని, హోసూరు, బెంగళూరు తదితర నగరాలకు 160 బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఈ నెల 10న రాష్ట్రంలోని పాఠశాలలు తెరవనుండటంతో ఇతర జిల్లాల నుంచి నగరానికి వచ్చేందుకు ఈ నెల తొమ్మిదో తేదీన 705 బస్సులు నడుపుతామన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల ఏడు నుండి తొమ్మిదివరకు బస్సులలో ప్రయాణించేందుకు 30 వేలమంది టికెట్లు రిజర్వు చేసుకున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్ళదలచిన వారు www.tnstc.in అనే వెబ్‌సైట్ ద్వారా టికెట్లు రిజర్వు చేసుకోవచ్చునని అధికారులు వివరించారు.



అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం చెన్నై యతిరాజ్ కళాశాలలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

'నోటా'కు ఓటేసిన 4.5 లక్షల మంది

● శ్రీపెరుంబుదూర్ మొదటి స్థానం



పెరంబూర్, జూన్ 5: రాష్ట్రంలో 'నోటా'కు 4.5 లక్షల మంది ఓటు వేశారు. అందులో శ్రీపెరుంబుదూర్ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఒక నియోజకవర్గంలో పోటీచేస్తున్న ఏ ఒక్క అభ్యర్థి కూడా నచ్చని ఓటర్లు 'నోటా'కు ఓట్లు వేస్తుంటారు. నోటా అధిక ఓట్లు పోలైనా అందులో ఎలాంటి ఫలితం ఉండదు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 19వ తేది జరుగగా, మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగిన విషయం తెలిసిందే. అందులో రాష్ట్రవ్యాప్తంగా నోటాకు 4,61,327 ఓట్లు పోలయ్యాయి. నోటాకు ఓట్ల శాతం 1.06గా ఉంది. నోటాకు అధిక ఓట్లు పోలైన నియోజకవర్గంగా శ్రీపెరుంబుదూర్ నిలిచింది. ఈ నియోజకవర్గంలో నోటాకు 26,450 ఓట్లు పోలయ్యాయి.

నోటాకు అధిక ఓట్లు పొందిన నియోజకవర్గాలు
శ్రీ పెరుంబుదూర్- 26,450
దిండుగల్ - 22,120
తిరువళ్లూర్ - 18,978
తిరుప్పూర్ - 17,165
కాంచీపురం - 16,965
సేలం - 14,894

20 నియోజకవర్గాలు...

దక్షిణ చెన్నై, ఉత్తర చెన్నై, మధ్య చెన్నై, మదురై, అరక్కోణం, కోయంబత్తూర్, ఈరోడ్, కాంచీపురం, కృష్ణగిరి, నామక్కల్, నీలగిరి, పెరంబలూరు, పొల్లాచ్చి, తెన్‌కాశి, తంజావూరు, తేని, తిరుచ్చి, తిరుప్పూర్, తిరువళ్లూర్, తిరువణ్ణామలై తదితర 20 నియోజకవర్గాల్లో నోటాకు 10 వేలకు పైగా ఓట్లు పోయ్యాయి. కన్నియాకుమారి నియోజకవర్గంలో తక్కువగా నోటాకు 3,755 ఓట్లు పోలయ్యాయి.

చెన్నై పరిధిలో 'నోటా'కు 40,024 ఓట్లు

చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో నోటాకు 40,024 మంది ఓటేశారు. అలాగే, 1,512 తపాలా ఓట్లు చెల్లవని ప్రకటించారు. అధికంగా దక్షిణ నియోజకవర్గంలో నోటాకు అధికంగా ఓట్లు నమోదుకాగా, చెల్లని తపాలా ఓట్లు కూడా ఈ నియోజకవర్గంలోనే అధికంగా ఉన్నాయి. ఆ ప్రకారం, ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో 14,96,224 మంది ఓటర్లు, దక్షిణ చెన్నైలో 20,23,133 మంది ఓటర్లు, మధ్య చెన్నైలో 13,50,161 మంది మొత్తం 48,69,518 మంది ఓటర్లున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో డీఎంకే అభ్యర్థులు విజయం సాధించారు. ఉత్తర చెన్నై నియోజకవర్గంలో 9,02,753 ఓట్లు పోలుకాగా, అందులో 13,208 ఓట్లు నోటాకు లభించాయి. ఇక, వృద్ధులు, దివ్యాంగులు, సైనికులు, ఎన్నికల సిబ్బందికి అందజేసిన తపాలా ఓట్లలో 264 ఓట్లు చెల్లవని ప్రకటించారు. అలాగే, మధ్య చెన్నైలో 7,31,119 ఓట్లు పోలవ్వగా, వాటిలో 11,163 ఓట్లు నోటాకు లభించాయి. అలాగే, ఈ నియోజకవర్గంలో 564 తపాలా ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ఇక, దక్షిణ చెన్నై నియోజకవర్గంలో 11,99,006 ఓట్లు పోలవ్వగా, వాటిలో 15,653 ఓట్లు నోటాకు రాగా, 684 తపాలా ఓట్లు చెల్లనివిగా అధికారులు ప్రకటించారు.

అన్నాడీఎంకే 20 శాతం ఓటు బ్యాంకు ఏమైంది?

● ఏడు చోట్ల మూడో స్థానం



అడయార్, జూన్ 5: ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే చావుదెబ్బతింది ఆ పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో చిత్తుగా ఓడిపోయింది. పైగా ఏడు స్థానాల్లో ఏకంగా మూడో స్థానానికి పరిమితమైంది. పుదుచ్చేరిలో అయితే దరావత్తు కోల్పోయింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవించివున్న సమయంలో ఆ పార్టీ ఓటు బ్యాంకు 44.92 శాతం ఉంటే, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ సాధించిన ఓట్ల శాతం కేవలం 20.47 శాతం మాత్రమే. మిగిలిన 20 శాతం ఓటు బ్యాంకు ఏమైందన్న చర్చ అన్నాడీఎంకే శ్రేణుల్లోనే జరుగుతుంది. 2014లో దేశ వ్యాప్తంగా నరేంద్ర మోడీ హవా కొనసాగింది. ఈ గాలి తమిళనాడులో పనిచేయలేదు. ఈ ఎన్నికల్లో జయలలిత సారథ్యంలోని అన్నాడీఎంకే ఒంటరిగా పోటీ చేసి 37 లోక్‌సభ స్థానాల్లో గెలుపొందింది. ఓట్ల శాతం 44.92 శాతం వచ్చింది. జయలలిత మృతి తర్వాత అన్నాడీఎంకే ఓటు బ్యాంకు క్రమంగా బలహీనపడటం ప్రారంభమైంది. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన అన్నాడీఎంకే, ఈ ఎన్నికల్లోనూ చిత్తు చిత్తుగా ఓడిపోయింది. ఆ పార్టీకి కేవలం 88.4 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే పలు గ్రూపులుగా విడిపోయింది. దీంతో ఆ పార్టీ ఓటు బ్యాంకు చెల్లాచెదురైంది. దీనికితోడు బీజేపీ క్రమంగా బలం పుంజుకుంటుంది. ఎక్కువ మంది అన్నాడీఎంకే నేతలు బీజేపీ వైపు మొగ్గు చూపారు. ప్రధాన నేతలు కమలం వైపు వెళ్ళడంతో వారి క్యాడర్ కూడా బీజేపీలో చేరిపోతున్నారు. ఈ కారణంగా అన్నాడీఎంకే ఓటు బ్యాంకు బలహీనపడటానికి ఓ కారణం. ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే 31 స్థానాలతో పాటు పుదుచ్చేరిలోని ఒక చోట పోటీ చేసింది. ఇందులో 23 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు రెండో స్థానంలో నిలువగా, 7 చోట్ల మూడో స్థానంలో ఉన్నారు. అన్నాడీఎంకే కంచుకోట కొంగు మండలంలో కూడా అన్నాడీఎంకే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కోవైలో డీఎంకే అభ్యర్థి విజయం సాధించగా, బీజేపీ తరఫున పోటీ చేసిన కె.అన్నామలై రెండో స్థానంలో, అన్నాడీఎంకే మూడో స్థానంలో నిలిచారు.

ఏడోసారి గెలిచిన టీఆర్ బాలు

● లోక్‌సభలో అత్యంత సీనియర్ సభ్యుడు ఆయనే



అడయార్, జూన్ 5: డీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి టీఆర్ బాలు మరోసారి విజయాన్ని రుచిచూశారు. ఏడోసారి ఆయన గెలుపొందారు. దీంతో కొత్తగా ఏర్పాటయ్యే సభలో అత్యంత సీనియర్ సభ్యుడిగా గుర్తింపు పొందనున్నారు. 1986లో తొలిసారి రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టిన 82 యేళ్ళ టీఆర్ బాలు 1996 నుంచి దక్షిణ చెన్నై లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. ఆ తర్వాత 2009లో శ్రీపెరంబుదూరు లోక్‌సభ స్థానంకు మారిన ఆయన.. 2019లో ఈ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇపుడు మరోమారు ఇక్కడ నుంచే విజయం అందుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 4,87,029 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయన సమీప ప్రత్యర్థి అన్నాడీఎంకే అభ్యర్థి ప్రేమ్‌కుమార్‌కు 2,71,582 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే, 2014లో ఆయన తంజావూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యా రు. ఇదే ఆయనకు తొలి ఓటమి కావడం గమనార్హం. డీఎంకేలోనే అత్యంత సీనియర్ నేత అయిన టీఆర్‌బీ. కొత్తగా ఏర్పాటయ్యే లోక్‌సభలో కూడా ఆయన సీనియర్ సభ్యుడిగా గుర్తింపు పొందనున్నారు. శ్రీపెరంబుదూరు నియోజకవర్గంలో మూడోసారి గెలుపొందడానికి ఆయన చేసిన పనులే ప్రధాన కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ నిర్వాహకులు

అడయార్, జూన్ 5: ప్రతి యేటా జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా పాటిస్తారు. ఇందులోభాగంగా బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధానంగా గ్రీన్ స్కూల్ ఇనిషియేటివ్‌లో అనుబంధ పాఠశాలలు అనేక రకాల పర్యావరణ అనుకూల కార్యక్రమాల్లో పాల్గొనేలా నిర్వహించారు. ఇందులో బెస్ట్ ఎఫెర్ట్స్ ఇన్ సస్టయినబులిటీ కింద నిర్వహించిన కార్యక్రమాన్ని మైలాపూర్‌లోని కెప్టెన్ ఎం.చెట్టియార్ ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి బహుమతి గెలుచుకోగా, బయో డైవర్సిటీ ఆన్ క్యాంపస్ విభాగంలో రెండో బహుమతిని పల్లావరంలోని లాల్జీ మెమోరియల్ ఒమేగా ఇంటర్నేషనల్ స్కూల్ కైవసం చేసుకుంది. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌లో మూడో బహుమతిని తిరువాన్మియూరులోని వెంకటేశ్వర విద్యాశ్రమ మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ స్కూల్ గెలుచుకుంది.

పోలీసులకు సెల్‌ఫోన్ అప్పగించిన టీటీఎఫ్ వాసన్

ప్యారీస్, జూన్ 5: సెల్‌ఫోన్ మాట్లాడుతూ గత నెల 15వ తేది ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన టీటీఎఫ్ వాసన్ కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం ఉదయం మదురై అన్నానగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన సెల్‌ఫోన్ అప్పగించారు. చెన్నై నుంచి కారులో తిరుచెందూర్‌కు తన మిత్రులతో కలసి డ్రైవింగ్ స్కూల్ కారులో వెళ్లిన వాసన్, మదురై ఒండియార్ బైపాస్ రోడ్డులో వెళ్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడం గుర్తించిన పోలీసులు ఆయనపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారని ఏడు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. అరెస్ట్ చేసి కారు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెయిలు మంజూరు చేసిన మదురై జిల్లా జ్యుడీషియల్ కోర్టు ఆదేశాల మేరకు వాసన్ తన సెల్‌ఫోన్ సహా డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పోలీసులకు అప్పగించారు.

సైన్స్ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యా వేడుకలు



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూన్ 5: స్థానిక ఊరీసు ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో సైన్స్ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం విద్యా వేడుకలు జరిగాయి. ఈ వేడుకల ముగింపు కార్యక్రమానికి సమాఖ్య అధ్యక్షురాలు దేవి అధ్యక్షత వహించగా, జిల్లా సెక్రటరీ జనార్ధనన్, కార్యకర్తల కమిటీ నిర్వాహకులు జోసఫ్, అనన్య, రాజేంద్రన్, కుమరన్, రాము, ఇళంగోవన్, రాణిపేట జిల్లా సైన్స్ సమాఖ్య సెక్రటరీ పళనివేల్ తదితరులు పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి సమాఖ్య కోశాధికారి శేఖర్ ఆహ్వానం పలుకగా, కార్యకర్తల కమిటీ నిర్వాహకులు ప్రశాంత్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో 6 నుంచి 12వ తరగతి వరకు 139 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ కలసి పనిచేయాల్సిన సమయం

● వీకే శశికళ పిలుపు

పెరంబూర్, జూన్ 5: పార్టీ బలోపేతానికి అందరూ కలసి పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని వీకే శశికళ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో... శాసనసభ, స్థానిక, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ పరాజయం కార్యకర్తలను ఆవేదనకు గురిచేసిందన్నారు.రాష్ట్రాభివృద్ధి,అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా దివంగత నేత ఎంజీఆర్ స్థాపించిన పార్టీని ఆయన అడుగుజాడల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నడిపిందన్నారు. అలాంటి పార్టీ ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో 7 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిందనే వార్త ఆవేదన కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా నేతలు కలసి పనిచేసి పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని శశికళ పేర్కొన్నారు.

రాముడే మోదీకి బదులిచ్చారు

● ఎంపీ మాణిక్కం ఠాగూర్

పెరంబూర్, జూన్ 5: భక్తి అనేది వేరు, రాముడిని వ్యాపారం చేయడం వేరు అని రాముడే మోదీకి బదులు చెప్పారని విరుదునగర్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మోదీకి ఎల్లప్పుడూ వ్యతిరేక పవనాలు వీస్తుంటాయని, మతతత్వ శక్తులకు రాష్ట్రప్రజలు చోటివ్వరన్నారు. తనకు ఓటేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అన్నివిధాల అండగా ఉంటానని ఎంపీ తెలిపారు.

మళ్లీ వస్తాం..విజయం సాధిస్తాం

● దక్షిణ చెన్నై బీజేపీ అభ్యర్థి తమిళిసై

ప్యారీస్, జూన్ 5: దక్షిణ చెన్నై లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి విజయావకాశాలు కోల్పోయిన డా.తమిళిసై సౌందర్‌రాజన్ తనకు ఓటేసిన వారికి, తన కోసం ఎన్నికల్లో పనిచేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడులోని 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీచేసి బీజేపీ విజయావకాశాలు కోల్పోయిందని, ఇందుకు గల కారణాలపై పార్టీ అధిష్టానం రాష్ట్ర బీజేపీ నేతలతో సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజలకు నిస్వార్ధ సేవలు అందించాలన్నదే బీజేపీ లక్ష్యమని, తాము ప్రస్తుతం ఓడిపోయినా, మళ్లీ వస్తామని తప్పకుండా గెలుస్తామని తమిళిసై ధీమా వ్యక్తం చేశారు.

సారీ! మోదీజీ!

బీజేపీ అభ్యర్థి వినోజ్ సెల్వం

ప్యారీస్, జూన్ 5: సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి 1,69,159 ఓట్లు సాధించి విజయావకాశాలు కోల్పోయిన వినోజ్ పి.సెల్వం ప్రధాని నరేంద్ర మోదీకి తన ఎక్స్ పేజీలో సారీ చెప్పారు. తాను పోటీచేసేందుకు బీజేపీ అధిష్టానం అవకాశం కల్పించిందని, ఆ నియోజకవర్గంలో తన విజయం కోసం పనిచేసిన పార్టీ శ్రేణులందరికీ, ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'గెలవనందుకు నన్ను క్షమించాలి, నేను ఎల్లప్పుడు మీ పాదదాసుడిగానే ఉంటాను' అని ప్రధానికి ఎక్స్ పేజీలో పోస్టుచేశారు.

అన్నాడీఎంకేను వెనక్కినెట్టిన ఓపీఎస్

ప్యారీస్, జూన్ 5: రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి తరఫున ఇండిపెండెంట్‌గా పనస పండు గుర్తుపై పోటీచేసిన మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) గెలవకపోయినా, అన్నాడీఎంకేను వెనక్కినెట్టి రెండో స్థానంలో నిలిచారు. డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి తరఫున ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత నవాజ్‌ఘనీ రామనాథపురం నియోజకవర్గంలో పోటీచేసి 5,09,664 ఓట్లు పొంది విజయం సాధించారు. ఓపీఎస్ 3,42,882 ఓట్లు సాధించగా, అన్నాడీఎంకే అభ్యర్థి జయపెరుమాళ్ 99,249 ఓట్లకే పరిమితమయ్యారు. దీని ద్వారా ఓపీఎస్ అన్నాడీఎంకే కంటే రెండు లక్షలకు పైగా ఓట్లు సాధించడం గమనార్హం.

ఘనంగా కాళియమ్మన్ ఆలయ ఉత్సవం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

ఐసిఎఫ్, జూన్ 5: దిండుగల్ జిల్లా పళని సమీపంలో ఉన్న కాళియమ్మన్ ఆలయ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. నెయిగారపట్టి కె.వేలూరులో నిమందుకాళియమ్మన్, ఉచ్చికాళియమ్మన్ ఆలయ వైకాశి ఉత్సవాలు మేలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధన జరిగాయి. రాత్రి ప్రధాన కార్యక్రమంలో రథోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం 5 వేల మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తాం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



మీడియాతో అన్నామలై

పెరంబూర్, జూన్ 5: రాష్ట్రప్రజల తీర్పును శిరసావహిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. టి.నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం అన్నామలై మీడి యా సమావేశంలో మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నెహ్రూ తర్వాత మూడో సారిగా నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకానుందన్నారు. ప్రజాదరణతో మూడవసారి అధికారం చేపట్టడం ఎంతో కష్టమైన పని కాదన్నారు. రాష్ట్రంలో విజయం కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమించారన్నారు. కానీ, రాష్ట్రం నుంచి పార్లమెంటుకు బీజేపీ తరఫున ఎంపీలను పంపలేకపోయామని తెలిపారు. కొన్ని స్థానాల్లో తక్కువ ఓట్లతో పార్టీ అభ్యర్థులు ఓటమి చవిచూశారన్నారు. కోవై నియోజకవర్గంలో డబ్బులు పంచకపోయినా 4 లక్షల ఓట్లు సాధించామన్నారు. తమ లక్ష్యం 2026 అసెంబ్లీ ఎన్నికలని, ఆ ఎన్నికల్లో మెజార్టీ విజయం సాధించి అధికారం చేపట్టడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన డీఎంకేకు శుభాకాంక్షలు అని అన్నామలై తెలిపారు.

ప్రాంతీయ పార్టీ హోదా కోల్పోయిన పీఎంకే

ప్యారీస్, జూన్ 5: రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో చేరిన పీఎంకే అతితక్కువ ఓటు శాతం పొంది ప్రాంతీయ పార్టీ హోదా కోల్పోయింది. పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ సతీమణి సౌమ్య ధర్మపురి నియోజకవర్గంలో పోటీచేసి విజయావకాశాలు కోల్పోయారు. ఈ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కూటమి నుంచి 10 నియోజకవర్గాల్లో పోటీచేసిన పీఎంకేకు 4.23 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. అందువల్ల రాష్ట్రంలో ఇప్పటికే డీఎండీకే ప్రాంతీయ పార్టీ హోదా కోల్పోయిన నేపథ్యంలో, ప్రస్తుతం పీఎంకే కూడా ఆ జాబితాలో చేరడం గమనార్హం.



వేలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువ పత్రం స్వీకరిస్తున్న దృశ్యం (చిత్రంలో) మంత్రి దురైమురుగన్, పార్టీ నేతలు

28 ఏళ్ల అనంతరం కోవైలో డీఎంకే విజయం



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రాన్ని అందుకుంటున్న గణపతి రాజ్‌కుమార్

ప్యారీస్, జూన్ 5: దాదాపు 28 ఏళ్ల అనంతరం కోవై లోక్‌సభ నియోజకవర్గాన్ని డీఎంకే కైవసం చేసుకుంది. దక్షిణ భారత మాంచెస్టర్‌గా అభివృద్ధి చెందిన కోవై నియోజకవర్గంలో చిన్న, పెద్ద తరహా పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఎన్నికల విజయాన్ని నిర్ణయించడంలో శ్రామికవర్గాల ఓట్లే కీలకం. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు సార్లు, ఉభయ కమ్యూనిస్టులు ఏడు సార్లు, బీజేపీ, అన్నాడీఎంకే తలా ఒకసారి విజయం సాధించాయి. ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే ఈ నియోజకవర్గాన్ని కూటమి పార్టీలకే కేటాయిస్తూ వచ్చాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కోవైలో డీఎంకే తరఫున గణపతి రాజ్‌కుమార్ పోటీచేశారు. అన్నాడీఎంకే అభ్యర్థిగా సింగై రామచంద్రన్, బీజేపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సహా వివిధ పార్టీల తరఫున 11 మంది, 26 మంది స్వతంత్రులు మొత్తం 37 మంది బరిలో నిలిచారు. వీరిపై గణపతి రాజ్‌కుమార్ విజయం సాధించారు. దీనిపై డీఎంకే నాయకులు మాట్లాడుతూ.. 1996వ సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే తరఫున పోటీచేసిన రామనాథన్ గెలిచారని, ఆ తర్వాత 28 ఏళ్లకు ఉదయించే సూర్యుడు గుర్తును స్థానిక ఓటర్లు గెలిపించారని తెలిపారు.

మొబైల్ యాప్ ద్వారా రూ.50 వేలు కోల్పోయిన నర్సు

పెరంబూర్, జూన్ 5: మొబైల్ యాప్ ద్వారా నగదు కోల్పోయిన నర్సు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొళత్తూర్ పుంపుహార్ నగర్ కు చెందిన గౌరి రాజ భార్య మురుగేశ్వరి స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆమె సోమవారం రాత్రి 10 గంటల సమయంలో బ్యాంక్ ఖాతాలో నగదు ఎంత ఉంది అంటూ సెల్‌ఫోన్ చూస్తున్న సమయంలో, హఠాత్తుగా మరో లింక్ వచ్చింది. దానిని పరిశీలించిన మురేగేశ్వరి, అందులో అడిగిన వివరాలు నమోదుచేశారు. అనంతరం ఆమెకు అనుమానం రావడంతో వివరాలు అప్‌లోడ్ చేయకుండా యాప్ నుంచి బయటకు వచ్చేశారు. కొద్దినిముషాలకే ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.50 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో దిగ్భ్రాంతి చెంది కొళత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు...!

● అయినా అన్నాడీఎంకేకు తప్పని పరాజయం

పెరంబూర్, జూన్ 5: పొల్లాచ్చి లోక్‌సభ నియోజకవర్గం పరిధి లోని ఆరు శాసనసభ స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నా అన్నాడీఎంకేకు పరాజయం తప్పలేదు. ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పొల్లాచ్చి, ఉడుమలై, మడత్తుకుళం, వాల్పారై, కినత్తుకడవు, తొండాముత్తూర్ తదితర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆరు స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నందు వల్ల పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం తథ్యమని అన్నాడీఎంకే అధిష్టానం భావించింది. పార్టీ అభ్యర్థిగా కార్తికేయన్‌ను ప్రకటించినప్పటి నుంచి నియోకవర్గంలో ప్రచారం చేపట్టారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో కార్తికేయన్ 2,50,162 ఓట్ల తేడాతో డీఎంకే అభ్యర్థి ఈశ్వరస్వామి చేతిలో ఓటమి చవిచూశారు. ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నా ఎంపీ అభ్యర్థి ఓడిపోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఏర్పాటులో జాప్యం, ప్రచారంలో కొరవడిన ఐక్యత తదితరాల కారణంగా ఓటమి తప్పలేదని ఆ పార్టీ నేతలు బహిరంగా పేర్కొంటున్నారు.

131 సీసాల మద్యం స్వాధీనం

పెరంబూర్, జూన్ 5: స్థానిక నంగనల్లూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం టాస్మాక్ మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, నంగనల్లూర్ ఎంజీఆర్ రోడ్డులోని టాస్మాక్ మద్యం దుకాణం సమీపంలో కొందరు మద్యం విక్రయిస్తున్నట్లు సెయింట్ థామస్ మౌంట్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, మద్యం విక్రయిస్తున్న రామనాథపురం జిల్లా తిరువాడనైకు చెందిన ఇళయరాజా, నంగనల్లూర్ ఎన్జీఓ కాలనీకి చెందిన డెన్నిస్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 131 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.


రూ.4 కోట్ల వ్యవహారం... విచారణకు హాజరైన కేశవ వినాయకం

పెరంబూర్, జూన్ 5: రైలులో రూ.4 కోట్లు స్వాధీనం వ్యవహారానికి సంబంధించి సీబీసీఐడీ ఎదుట బీజేపీ నేత కేశవ వినాయకం బుధవారం హాజరయ్యారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19న జరిగిన విషయం విదితమే. ఎన్నికల ప్రచార సమయంలో తాంబరం రైల్వేస్టేషన్‌లో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రూ.4 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదు తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ కోసం తీసుకెళ్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ చేపట్టింది. ఈ కేసులో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని కోరుతూ బీజేపీ నేత కేశవ వినాయకంకు సీబీసీఐడీ సమన్లు జారీచేసింది. ఎన్నికల ఫలితాల అనంతరం హాజరవుతారని కేశవ వినాయకం తెలిపారు. ఆ ప్రకారం ఎగ్మూర్‌లో ఉన్న సీబీసీఐడీ కార్యాలయంలో బుధవారం విచారణకు కేశవ వినాయకం హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటివరకు 15 మందిని విచారించినట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ టీచర్ల నియామక జాబితాపై హైకోర్టు స్టే

పెరంబూర్, జూన్ 5: గత ఫిబ్రవరి 4వ తేది నిర్వహించిన డిగ్రీ టీచర్ల నియామక పరీక్షల ఆధారంగా తుది జాబితా విడుదలపై హైకోర్టు మదురై శాఖ స్టే విధించింది. మదురై సిమ్మక్కల్ ప్రాంతానికి చెందిన సుధ దాఖలుచేసిన పిటిషన్ బుధవారం విచారించిన హైకోర్టు, తుది నియామక జాబితా విడుదలపై తాత్కాలిక స్టే విధించింది.

మూడు ప్రభుత్వ బస్సుల జప్తు



బస్సులకు నోటీసులు అంటించిన కోర్టు సిబ్బంది

పెరంబూర్, జూన్ 5: గోపిశెట్టిపాళయం సమీపంలో ప్రభుత్వ బస్సు ఢీకొని మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లించని కేసులో, మూడు ప్రభుత్వ బస్సులను జప్తు చేశారు. తిరుప్పూర్ జిల్లాకు చెందిన రత్నస్వామి 2002లో ప్రభుత్వ బస్సు ఢీకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి చెల్లించాల్సిన రూ.14.18 లక్షల పరిహారాన్ని 22 ఏళ్లుగా రవాణా శాఖ ఇవ్వలేదు. దీంతో, కోర్టు ఉత్తర్వులతో బస్టాండ్ నిలిపిన మూడు ప్రభుత్వ బస్సులకు కోర్టు సిబ్బంది జప్తు నోటీసులు అంటించారు.



మహాలింగపురంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ధ్వజారోహణం చేస్తున్న శబరిమలై అయ్యప్పస్వామి తంత్రి మహేష్ తదితరులు



చెన్నై గోపాలపురంలోని ఇంట్లో తన తల్లి రాజాత్రి అమ్మాళ్‌కు విజయ ధృవీకరణ పత్రం చూపిస్తున్న తూత్తుకుడి ఎంపీ కనిమొళి

శశికాంత్ సెంథిల్‌కు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ



తిరువళ్లూర్ కాంగ్రెస్ ఎంపీగా గెలిచిన శశికాంత్ సెంథిల్

ప్యారీస్, జూన్ 5: రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో మాజీ ఐఏఎస్ అధికారి డా.శశికాంత్ సెంథిల్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీకి ఘనత చేకూర్చారు. తిరువళ్లూర్ (రి) నియోజకవర్గంలో డీఎండీకే, బీజేపీ, బహుజన సమాజ్ పార్టీ సహా 14 మందితో శశికాంత్ సెంథిల్ పోటీ పడ్డారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే మిగతా అభ్యర్థుల కంటే హస్తం గుర్తుపై పోటీచేసిన ఆయన ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. ఎన్నికల అధికారి వెల్లడించిన లెక్కల ప్రకారం, 7,96,956 ఓట్లు సాధించి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో రికార్డు నెలకొల్పారు. ఆయన బీజేపీ అభ్యర్థి పొన్.బాలగణపతి కంటే 5,72,155 ఓట్ల తేడాలో విజయం సాధించారు. శశికాంత్ సెంథిల్ కర్ణాటక క్యాడర్ ఐఏఎస్ అధికారిగా పనిచేశారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ, రాయచూర్ జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ఇవే కాకుండా పలు శాఖల్లో అభివృద్ధి పనులు చేపట్టి పలువురు ప్రశంసలు అందుకున్నారు. 2019 సెప్టెంబరులో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన శశికాంత్ కాంగ్రెస్‌లో చేరి మొట్టమొదటి సారిగా ఎంపీ హోదాలో పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నారు.

ఎవరికెన్ని ఓట్లు?



లోక్‌సభ ఎన్నికల పోరు ముగిసింది. మంగళవారం ఓట్ల లెక్కింపుతో జయాపజయాలు తేలిపోయాయి. ఏ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? ఏ అభ్యర్థికి ఎన్ని వచ్చాయి? తదితర వివరాలను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 39 నియోజకవర్గాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి లోక్‌సభ స్థానం పోలింగ్‌కు సంబంధించిన వివరాలివీ... - ఆంధ్రజ్యోతి, చెన్నై

తిరువళ్లూరు - (కాంగ్రెస్ విజయం)
మొత్తం ఓట్లు - 20,85,991
పోలైన ఓట్లు - 14,18,317
శశికాంత్ సెంథిల్ (కాంగ్రెస్) - 7,96,956
బాలగణపతి (బీజేపీ) - 2,24,801
నల్లతంబి (డీఎండీకే) - 2,23,904
జగదీష్‌చందర్ (ఎన్‌టీకే) - 1,20,838

తిరువణ్ణామలై - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 15,33,099
పోలైన ఓట్లు - 11,37,832
సీఎన్ అన్నాదురై (డీఎంకే) - 5,47,379
ఎం కళియపెరుమాళ్ (ఏడీఎంకే) - 3,13,448
అశ్వత్థామన్ (బీజేపీ) - 1,56,650
రమేష్‌బాబు (ఎన్‌టీకే) - 83,869

పొల్లాచ్చి - (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,97,467
పోలైన ఓట్లు -11,24,743
ఈశ్వరమూర్తి (డీఎంకే) - 5,30,128
కార్తికేయన్ (ఏడీఎంకే) - 2,79,966
వసంతరాజన్ (బీజేపీ) - 2,21,770
సురేష్‌కుమార్ (ఎన్‌టీకే) - 57,882

శివగంగ (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 16,33,857
పోలైన ఓట్లు - 10,49,675
కార్తీ చిదంబరం (కాంగ్రెస్) - 4,27,677
జేవియర్ దాస్ (ఏడీఎంకే) - 2,22,013
దేవనాథన్ యాదవ్ (బీజేపీ) - 1,95,788
ఎళిలరసి (ఎన్‌టీకే) - 1,63,412

ఉత్తర చెన్నై - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 14,96,224
పోలైన ఓట్లు - 8,99,367
డా. కళానిధి వీరాసామి (డీఎంకే) - 4,97,333
రాయపురం మనో (ఏడీఎంకే) - 1,58,111
పాల్ కనకరాజ్ (బీజేపీ) - 1,13,318
డా. అముదిని (ఎన్‌టీకే) - 95,954

ఆరణి - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 14,96,118
పోలైన ఓట్లు -11,33,193
ఎంఎస్ ధరణివేందన్ (డీఎంకే) - 4,01,091
జీవీ గజేంద్రన్ (ఏడీఎంకే) - 2,37,734
ఎ.గణేష్‌కుమార్ (పీఎంకే) - 1,91,462
కె.భాగ్యలక్ష్మి (ఎన్‌టీకే) - 54,170

దిండుగల్ - (సీపీఎం గెలుపు)
మొత్తం ఓట్లు - 16,07,051
పోలైన ఓట్లు -11,50,445
సచ్చిదానందం (సీపీఎం) - 6,70,149
మహమ్మద్ ముబారక్ (ఎస్‌డీపీఐ)- 2,26,328
తిలక బామా (పీఎంకే)- 1,12,503
డా. కయిలైరాజన్ (ఎన్‌టీకే) - 97,845

మదురై (సీపీఎం గెలుపు)
మొత్తం ఓట్లు - 15,83,250
పోలైన ఓట్లు -9,80,211
కె.వెంకటేశన్ (సీపీఎం) - 4,30,323
రామ శ్రీనివాసన్ (బీజేపీ) - 2,20,914
డా. శరవణన్ (ఏడీఎంకే) - 2,04,804
సత్యాదేవి (ఎన్‌టీకే) - 92,879

దక్షిణ చెన్నై - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 20,23,133
పోలైన ఓట్లు -10,96,026
తమిళచ్చి తంగపాండ్యన్ (డీఎంకే) - 5,13,974
డా. తమిళిసై సౌందరరాజన్ (బీజేపీ) - 2,89,019
డా. జయవర్ధన్ (ఏడీఎంకే) - 1,17,274
తమిళ్‌సెల్వం (ఎన్‌టీకే) - 83,391

విల్లుపురం (రి) - (డీపీఐ విజయం)
మొత్తం ఓట్లు - 15,03,115
పోలైన ఓట్లు - 11,54,467
దురై రవికుమార్ (డీపీఐ) - 4,77,033
భాగ్యరాజ్ (ఏడీఎంకే) - 4,06,330
మురళీశంకర్ (పీఎంకే) - 1,81,882
కళంజియం (ఎన్‌టీకే) - 57.242

కరూరు (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 14,29,790
పోలైన ఓట్లు -11,25,241
జ్యోతిమణి (కాంగ్రెస్) - 5,31,829
తంగవేల్ (ఏడీఎంకే) - 3,66,209
వీవీ సెంథిల్‌నాథన్ (బీజేపీ) - 1,01,517
కరుప్పయ్యా (ఎన్‌టీకే) - 86,962

తేని (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 18,22,949
పోలైన ఓట్లు -11,43,159
తంగతమిళ్‌సెల్వన్ (డీఎంకే) - 5,71,493
టీటీవీ దినకరన్ (ఏఎంఎంకే) - 2,92,669
వీటీ నారాయణస్వామి (ఏడీఎంకే) - 1,55,587
మదన్ (ఎన్‌టీకే) - 76,834

సెంట్రల్ చెన్నై - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 13,50,161
పోలైన ఓట్లు - 7,28,614
దయానిధి మారన్ (డీఎంకే) - 4,13,848
వినోజ్ పి. సెల్వం (బీజేపీ) - 1,69,159
పార్థసారథి (డీఎండీకే) - 72,016
డా. కార్తికేయన్ (ఎన్‌టీకే) - 46,031

కళ్లకురిచ్చి - (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,68,681
పోలైన ఓట్లు -12,42,597
మలైయరసన్ (డీఎంకే) - 5,61,589
కుమారగురు (ఏడీఎంకే) - 5,07,805
దేవదాస్ (పీఎంకే) - 71,290
జగదీశన్ (ఎన్‌టీకే) - 73,652

తిరుచ్చి (ఎండీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,53,985
పోలైన ఓట్లు - 10,55,964
దురై వైగో (ఎండీఎంకే) - 5,42,213
కరుప్పయ్యా (ఏడీఎంకే) - 2,29,119
రాజేష్ (ఎన్‌టీకే) - 1,07,458
సెంథిల్‌నాథన్ (ఏఎంఎంకే) - 1,00,747

విరుదునగర్ (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 15,01,942
పోలైన ఓట్లు - 10,56,101
మాణిక్యం ఠాకూర్ (కాంగ్రెస్) - 3,82,876
విజయ ప్రభాకరన్ (డీఎండీకే) - 3,78,243
రాధిక శరత్‌కుమార్ (బీజేపీ) - 1,64,149
డాక్టర్ కౌశిక్ (ఎన్‌టీకే) - 76,122

శ్రీపెరుంబుదూరు - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 23,82,119
పోలైన ఓట్లు - 14,36,025
టీఆర్ బాలు (డీఎంకే) - 7,58,511
ప్రేమ్‌కుమార్ (ఏడీఎంకే) - 2,71,582
వేణుగోపాల్ (టీఎంసీ) - 2,10,222
రవిచంద్రన్ (ఎన్‌టీకే) - 1,40,201

సేలం - (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 16,58,681
పోలైన ఓట్లు -12,95,994
టీఎం సెల్వగణపతి (డీఎంకే)- 5,46,272
విఘ్నేష్ (ఏడీఎంకే) - 4,78,901
అన్నాదురై (పీఎంకే) - 1,22,110
డా. మనోజ్‌కుమార్ (ఎన్‌టీకే) - 73,623

పెరంబలూరు (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 14,46,352
పోలైన ఓట్లు -11,90,376
అరుణ్‌నెహ్రూ (డీఎంకే) - 6,03,209
చంద్రమోహన్ (ఏడీఎంకే) - 2,14,102
పారివేందర్ (ఐజేకే) - 1,61,866
తేన్‌మొళి (ఎన్‌టీకే) - 1,13,092

రామనాథపురం (ఐయూఎంఎల్)
మొత్తం ఓట్లు - 16,17,688
పోలైన ఓట్లు - 11,06,838
నవాజ్ ఘనీ (ఐయూఎంఎల్) - 5,09,664
ఓ. పన్నీర్‌సెల్వం (స్వతంత్రుడు) - 3,42,882
జయపెరుమాళ్ (ఏడీఎంకే) - 99,.292
చంద్ర ప్రభా (ఎన్‌టీకే) - 97,001

కాంచీపురం - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 17,48,866
పోలైన ఓట్లు - 12,53,582
కె.సెల్వం (డీఎంకే) - 5,86,044
రాజశేఖర్ (ఏడీఎంకే) - 3,64,571
జ్యోతివెంకటేశన్ (పీఎంకే) - 1,64,931
సంతోష్‌కుమార్ (ఎన్‌టీకే) - 1,10,272

నామక్కల్ - (కేఎండీకే గెలుపు)
మొత్తం ఓట్లు - 14,52,562
పోలైన ఓట్లు - 11,03,972
మాతేశ్వరన్ (కేఎండీకే) 4,44,950
తమిళ్‌మణి (ఏడీఎంకే) - 4,16,763
కేపీ రామలింగం (బీజేపీ) - 1,00,498
కనిమొళి (ఎన్‌టీకే) - 89,693

కడలూరు (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 14,12,746
పోలైన ఓట్లు -10,33,394
విష్ణు ప్రసాద్ (కాంగ్రెస్) - 4,55,053
శివకొళుందు (డీఎండీకే) - 2,69,157
తంగర్‌బచ్చన్ (పీఎంకే) - 2,05,244
మణివాసగన్ (ఎన్‌టీకే) - 57,424

తూత్తుకుడి (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 14,58,430
పోలైన ఓట్లు -9,75,468
కనిమొళి (డీఎంకే) - 5,40,729
శివసామి వేలుమణి (ఏడీఎంకే) - 1,47,991
విజయశీలన్ (టీఎంసీ) - 1,22,380
రెవినా రూత్‌జేన్ (ఎన్‌టీకే) 1,20,300

అరక్కోణం - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 15,62,871
పోలైన ఓట్లు - 11,59,441
జగద్రక్షగన్ (డీఎంకే)- 5,63,216
ఏఎల్ విజయన్ (ఏడీఎంకే) - 256657
కె.బాలు (పీఎంకే) - 202325
ఎ.నజరీన్ (ఎన్‌టీకే) - 98944

ఈరోడ్ - (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,38,778
పోలైన ఓట్లు - 10,86,287
కేఈ ప్రకాష్ (డీఎంకే) - 5,62,339
అశోక్‌కుమార్ (ఏడీఎంకే) - 3,25,773
కార్మేగం (ఎన్‌టీకే) - 82,796
విజయకుమార్ (టీఎంసీ) - 77,911

చిదంబరం (డీపీఐ గెలుపు)
మొత్తం ఓట్లు - 15,19,847
పోలైన ఓట్లు -11,60,635
తిరుమావళవన్ (డీపీఐ) - 4,47,054
చంద్రహాసన్ (ఏడీఎంకే) - 3,44,208
కాత్యాయని (బీజేపీ) - 1,45,596
ఝాన్సీరాణి (ఎన్‌టీకే) - 58,374

తెన్‌కాశి (రి) (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,25,439
పోలైన ఓట్లు - 10,39,119
డాక్టర్ రాణిశ్రీకుమార్ (డీఎంకే) - 4,25,679
డా. కృష్ణసామి (పుదియతమిళగం)- 2,29,480
జాన్‌పాండ్యన్ (టీఎంఎంకే) 2,08,825
ఇసైమదివానన్ (ఎన్‌టీకే) - 1,30,335

వేలూరు - (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 1528273
పోలైన ఓట్లు - 1123715
కదిర్ ఆనంద్ (డీఎంకే)- 5,68,602
ఏసీ షణ్ముగం(న్యూజస్టిస్ పార్టీ)- 3,52,990
పసుపతి (ఏడీఎంకే)- 1,17,682
మహేష్ ఆనంద్ (ఎన్‌టీకే)- 32,284

తిరుప్పూరు (సీపీఐ గెలుపు)
మొత్తం ఓట్లు - 16,08,521
పోలైన ఓట్లు -11,43,624
కే సుబ్బరాయన్ (సీపీఐ) - 4,72,739
అరుణాచలం (ఏడీఎంకే) - 3,46,811
మురుగానందం (బీజేపీ) - 1,85,322
సీతాలక్ష్మి (ఎన్‌టీకే) - 95,726

మైలాడుదురై (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 15,45,568
పోలైన ఓట్లు -10,88,162
సుధ (కాంగ్రెస్) - 5,18,459
బాబు (ఏడీఎంకే) - 2,47,.278
ఎంకే స్టాలిన్ (పీఎంకే) - 1,66,271
కాళియమ్మాళ్ (ఎన్‌టీకే) - 1,27,642

తిరునల్వేలి (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 17,54,503
పోలైన ఓట్లు - 10,60,461
రాబర్ట్ బ్రూస్ (కాంగ్రెస్) - 5,02,296
నయినార్ నాగేంద్రన్ (బీజేపీ) - 3,36,676
ఝాన్సీరాణి (ఏడీఎంకే) - 89,601
సత్యా (ఎన్‌టీకే) - 87,686

కృష్ణగిరి - (కాంగ్రెస్ విజయం)
మొత్తం ఓట్లు - 1623179
పోలైన ఓట్లు 11,60,498
గోపీనాథ్ (కాంగ్రెస్)- 4,90,270
జయప్రకాష్ (ఏడీఎంకే) - 2,98,,959
నరసింహన్ (బీజేపీ) - 2,12,502
విద్యారాణి (ఎన్‌టీకే) - 1,06,079

నీలగిరి (రి) (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 14,26,387
పోలైన ఓట్లు - 10,.13,410
ఎ. రాజా (డీఎంకే) - 4,73,212
ఎల్.మురుగన్ (బీజేపీ) - 2,32,627
లోకేష్ తమిళ్‌సెల్వన్ (ఏడీఎంకే) - 2,20,230
జయకుమార్ (ఎన్‌టీకే) - 58,821

నాగపట్టినం (రి) (సీపీఐ గెలుపు)
మొత్తం ఓట్లు - 13,45,120
పోలైన ఓట్లు -9,73,773
వై.సెల్వరాజ్ (సీపీఐ) - 4,65,044
కర్సిత్ శంకర్ (ఏడీఎంకే) - 2,56,087
ఎం. కార్తికా (ఎన్‌టీకే) - 1,31,294
రమేష్ (బీజేపీ) - 1,02,173

కన్నియాకుమారి (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 15,57,915
పోలైన ఓట్లు -10,32,657
విజయ్ వసంత్ (కాంగ్రెస్) - 5,46,248
పొన్ రాధాకృష్ణన్ (బీజేపీ) - 3,66,341
మరియ జెనిఫర్ (ఎన్‌టీకే) - 52,721
పసలియాన్ నజరేత్ (ఏడీఎంకే) 41,393

ధర్మపురి (డీఎంకే విజయం)
మొత్తం ఓట్లు - 15,24,896
పోలైన ఓట్లు - 12,47,587
ఎ.మణి (డీఎంకే) - 4,32,667
సౌమ్యా అన్బుమణి (పీఎంకే) - 4,11,367
అశోకన్ (ఏడీఎంకే) - 2,93,629
అభినయ (ఎన్‌టీకే) - 65,381

కోయంబత్తూరు (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 21,06,128
పోలైన ఓట్లు -13,66,597
గణపతి రాజ్‌కుమార్ (డీఎంకే) 5,68,200
అన్నామలై (బీజేపీ) - 4,50,132
రామచంద్రన్ (ఏడీఎంకే) - 2,36,490
కలామణి (ఎన్‌టీకే) - 82,657

తంజావూరు (డీఎంకే గెలుపు)
మొత్తం ఓట్లు - 15,01,226
పోలైన ఓట్లు - 10,29,250
మురసొలి (డీఎంకే) - 5,02,245
శివనేశన్ (డీఎండీకే) - 1,88,662
మురుగానందం (బీజేపీ) - 1,70,613
హుమయూన్ కబీర్ (ఎన్‌టీకే) - 1,20,293

పుదుచ్చేరి (కాంగ్రెస్ గెలుపు)
మొత్తం ఓట్లు - 10,23,699
పోలైన ఓట్లు -8,07,940
వైద్యలింగం (కాంగ్రెస్) - 4,26,005
నమశ్శివాయం (బీజేపీ) - 2,89,489
మేనకా (ఎన్‌టీకే) 39,603
తమిళ్‌వేందన్ (ఏడీఎంకే) - 25,165

విజయంతో పాటు సంతృప్తినిచ్చిన చిత్రం

● నిర్మాత ఐసరి కె.గణేష్

చిత్రజ్యోతి

నిర్మాతగా కొన్ని చిత్రాలు వసూళ్ళ పరంగా తృప్తినిస్తాయని, మరికొన్ని సక్సెస్‌తో పాటు సంతృప్తిని కూడా ఇస్తాయని, ఆ కోవలో 'పీటీ సార్' చిత్రం నిలిచిందని ఆ సినిమా నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ వెల్లడించారు. ఆ చిత్రం విజయోత్సవ వేడుకలు బుధవారం నగరంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నేటి కాలంలో ఒక చిత్రం రెండు మూడు రోజులకు మించి థియేటర్లలో ప్రదర్శన జరగడం లేదు. కానీ, ఈ సినిమా రెండు వారాలు దాటినా విజయవంతంగా ప్రదర్శితమై ఇప్పటికే రూ.12 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ విషయాన్ని చాలా సంతోషంగా వెల్లడిస్తున్నాను. 'పీటీ సార్' సినిమా కలెక్షన్ల కంటే మంచి కథాంశాన్ని ప్రజలకు తెలియజెప్పామన్న తృప్తి మిగిలింది. మా బ్యానరులో ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. భవిష్యత్‌లో ఇలాంటి మంచి కథాంశంతో నిర్మించేందుకు మార్గదర్శకంగా నిలిచింది' అని అన్నారు. హీరో హిప్‌హాప్ ఆది మాట్లాడుతూ, 'ఈ సినిమా మీడియా మిత్రుల వల్లే సక్సెస్ సాధించింది. మంచి కంటెంట్ ఉన్న కథా చిత్రాన్ని మీడియా ఎన్నడూ విస్మరించిన సందర్భాలు లేవు. ఇలాంటి మంచి కంటెంట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాతకు ధన్యవాదాలు. అతిపెద్ద విద్యా సంస్థకు అధిపతి అయిన ఐసరి కె.గణేష్ ఈ కథను అంగీకరించి సొంతంగా నిర్మించడమంటే చాలా గొప్ప విషయం. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన దగ్గర అనేక విషయాలు నేర్చుకున్నాను. వేల్స్ నిర్మాణ సంస చిత్రాల్లో నటించకపోయినా ఫర్లేదు.. ఇలాంటి మంచి వ్యక్తితో స్నేహం మాత్రం కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష' అని పేర్కొన్నారు. దర్శకుడు కార్తీక్ వేణుగోపాలన్ మాట్లాడుతూ, ' విద్యా సంస్థల అధిపతిగా ఉంటూ ఇలాంటి కథాంశంతో సినిమా నిర్మించేందుకు ముందుకు వచ్చిన నిర్మాత ఐసరి గణేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాశ్మీర నటించారు.



'పీటీ సార్' సక్సెస్ మీట్‌లో దృశ్యం

శరత్ కుమార్ ఖాతాలో మరో 'హిట్'లిస్ట్!



'హిట్‌లిస్ట్'లో శరత్ కుమార్

తమిళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు త్రివిక్రమన్ కుమారుడు విజయ్ కనిష్క తొలిసారి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హిట్‌లిస్ట్'. సీనియర్ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషించగా, గత వారం విడుదలై పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. సూర్య కదిర్ కాకల్లార్, కె.కార్తికేయన్ ద్వయం ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆర్‌కే సెల్యులాయిడ్స్ పతాకంపై దర్శకుడు కెఎస్ రవికుమార్ నిర్మించారు. యాక్షన్, సస్పెన్స్ క్రైమ్ జోనర్‌లో ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్ర కథను పరిశీలిస్తే, 'ఐటీ కంపెనీలో పనిచేసే విజయ్ తల్లి, చెల్లిని గుర్తు తెలియని ముసుగు దొంగలు కిడ్నాప్ చేస్తారు. పోలీస్ సహాయ కమిషనర్ యశ్‌వేందన్ (శరత్ కుమార్) సాయంతో నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమవుతారు. అతని చర్యలను ఎప్పటికపుడు విఫలం చేస్తూ వచ్చిన కిడ్నాపర్ల ముఠా... విజయ్‌ను ఒక హత్య చేయాలన్న నిబంధన పెడతారు. అయితే, ఈ హత్య చేసేందుకు విజయ్ ససేమిరా అనడంతో తల్లిని, చెల్లిని చంపేస్తామని బెదిరిస్తారు. ఒక చిన్న ప్రాణికి కూడా హాని తలపెట్టేందుకు ఇష్టపడని విజయ్... తన తల్లి, చెల్లి ప్రాణాలు రక్షించుకునేందుకు కిడ్నాపర్ల ముఠా ఒత్తిడి మేరకు హత్య చేశాడా? లేదా? అన్నదే ఈ చిత్ర ప్రధాన కథాంశం. ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా శరత్ కుమార్ అద్భుతంగా నటించి, చిత్రానికి ప్రాణం పోశారు. ఆయన కింద పనిచేసే పోలీస్‌గా మునీష్‌కాంత్, నటించగా, డీన్‌గా గౌతం వాసుదేవ్ మేనన్, తండ్రి పాత్రలో సముద్రఖని, రౌడీగా రామచంద్ర రాజు, అమ్మ పాత్రలో సితార తమ తమ పాత్రల్లో ఒదిగిపోయారు.

షాలిని అజిత్ పేరుతో నకిలీ ఇన్‌స్టా ఖాతా!



తమిళ అగ్రహీరో అజిత్ కుమార్ సతీమణి షాలిని అజిత్ పేరుమీద నకిలీ ట్విటర్ ఖాతాను సైబర్ నేరగాళ్ళు క్రియేట్ చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన షాలిన్... తమ అభిమానులకు ఓ విన్నపం చేశారు. 'నా పేరు మీద నకిలీ ట్విటర్ ఖాతాను ప్రారంభించారు. దానిని ఎవరూ ఫాలో కావొద్దు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ నకిలీ ఖాతాను ఇప్పటికే 80 వేల మంది ఫాలోకావడం గమనార్హం. కాగా, అజిత్ కుమార్ ప్రస్తుతం మగిళ్ తిరుమేని దర్శకత్వంలో 'విడాముయర్చి' పేరుతో తెరకెక్కుతున్న చిత్రంలోనూ, ఆ తర్వాత ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీలో నటిస్తున్నారు.

పోలీస్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల శిబిరం



వృద్ధురాలి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న సందీప్‌రాయ్ రోథోడ్

పెరంబూర్, జూన్ 5: స్థానిక ఎగ్మూర్‌లోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా, పోలీసుల విజ్ఞప్తుల శిబిరం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ప్రజలు, పోలీసుల నుంచి వినతులు స్వీకరించారు. నగర ప్రజలు సమస్యలు నేరుగా తెలుసుకొని పరిష్కరించేలా నగర పోలీసు శాఖ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో, బుధవారం నిర్వహించిన శిబిరంలో ప్రజల నుంచి 12, పోలీసుల నుంచి 11 వినతులను పోలీస్ కమిషనర్ స్వీకరించి, వీటిపై విచారణ జరపాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... జనవరి 1 నుంచి మే 31వ తేది వరకు ప్రజల నుంచి 193 వినతులు స్వీకరించగా, వాటిలో 123 వినతులపై చర్యలు చేపట్టగా, 70 విచారణలో ఉన్నాయి. ఈ పిటిషన్లలో 10 సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించినవి కాగా, వాటిలో అధికారులు వారిళ్లకే వెళ్లి విచారణ చేపడుతున్నారు. సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించేలా 'బంధం' స్కీమ్ ఏర్పాటుచేసినట్లు, అందులోని 9499957575 అనే హెల్ప్ డెస్క్ నెంబర్‌కు బాధిత సీనియర్ సిటిజన్లు ఫిర్యాదు చేయవచ్చని నగర పోలీసు శాఖ తెలియజేసింది.

కుమరిలో వెనక్కి వెళ్లిన సముద్రం

● ఇసుకపై నిలిచిన పర్యాటక పడవలు



పెరంబూర్, జూన్ 5: సునామీ అనంతరం కన్నియాకుమారి సముద్రతీరంలో తరచూ మార్పులు సంభవిస్తున్నాయి. ఆ ప్రకారం, సముద్రం వెనక్కి వెళ్లడం, ముందుకు రావడం, అలల ఉధృతి అధికంగా ఉండడం, సముద్రతీరం కల్లోలంగా ఉండడం సంభవిస్తున్నాయి. ముఖ్యంగా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఈ మార్పులు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పౌర్ణమి ఘడియలు ముగిసిన నేపథ్యంలో, బుధవారం ఉదయం కన్నియాకుమారిలో సముద్రం హఠాత్తుగా వెనక్కి వెళ్లింది. దీంతో, పూంపుహార్ నౌకాయాన కేంద్రంలో నిలిపిన పర్యాటక పడవలు ఇసుకలో దిగాయి. సాధారణంగా ఈ కేంద్రం నుంచి సముద్రం మధ్యలోని వివేకానంద రాక్‌కు పర్యాటక పడవలు ఉదయం 8 గంటలకు బయల్దేరతాయి. కానీ, సముద్రం వెనక్కి వెళ్లడంతో పడవ రవాణాను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, రెండు గంటల అనంతరం సముద్రం యధాస్థితికి రావడంతో 10 గంటల నుంచి పడవ రవాణా ప్రారంభమైంది. దీంతో, వివేకానంద రాక్‌కు వెళ్లేందుకు ఉదయం 6 గంటలకే పూంపుహార్ నౌకాయాన కేంద్రానికి చేరుకున్న పర్యాటకులు సుమారు 4 గంటలు వేచి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.